క్లుప్తంగా

దుర్వాసనతో ఇబ్బందులు



మండవల్లి: స్థానిక చెత్త సంపద తయారీ కేంద్రం ఎదురుగా ఉన్న చెత్త పేరుకుపోవడంతో వచ్చే దుర్వాసనకు పరిసరాల కార్యాలయాల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండవల్లి ఎంపీడీఓ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం, ఎస్ఆర్ జీఈఎస్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఈ కేంద్రం సమీపంలో ఉన్నాయి. వర్షం కురిస్తే చెత్త తడిసి దుర్వాసన వ్యాపిస్తోంది. కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది, అక్కడికి వచ్చే ప్రజలు ఆ వాసనను భరించలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



తోట్లవల్లూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేసినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రక్షిత తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారులు, నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నట్లు తెలిపారు. నీరు ఎక్కువగా నిలువ ఉన్న చోట పంచాయతీ సిబ్బంది ఆయిల్‌బాల్స్ విడుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బందికి జ్వరాలపై ఇంటింటికీ వెళ్లి సర్వే జరపాలని సూచించామని తెలిపారు.

విత్తనశుద్ధి పంటలకు మేలు

ముదినేపల్లి రూరల్: సార్వా సాగుకు సంబంధించి మండలంలోని రైతులు విత్తనశుద్ధి విధిగా చేయాలని ఇది పంటలకు మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ అన్నారు. కార్యాలయంలో శుక్రవారంధాయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో రైతులు నేరుగా విత్తనాలు వెదజల్లుతుండగా కొన్ని కొన్ని గ్రామాల్లో నారుమళ్లు పోస్తున్నట్లు తెలిపారు. రైతులంతా విత్తనాలను శుద్ధి చేసుకుని చల్లుకుంటే తెగుళ్ల బారి నుంచి పైరును కాపాడుకోవచ్చన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు విత్తనాలు వెదజల్లిన పొలాలకు మొలకెత్తేందుకు ఎంతగానో సహాయపడతాయన్నారు. పీఎం కిసాన్ నగదు రైతుల కాతాల్లో జమ కావాలంటే స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

దారి వివాదంపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: కాలినడక దారికి సంబంధించి ఏర్పడిన వివాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొమ్మినంపాడుకు చెందిన బొడావుల కేశవర్ధిని, గోరింకల దేవేంద్రుడు మధ్య కాలినడక దారి వివాదం ఉంది. దీనిపై ఈ నెల నాల్గో తేదీన ఇద్దరూ ఘర్షణకు దిగారు. దేవేంద్రుడు కేశవర్ధిని తలపై గట్టిగా కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. జరిగిన సంఘటనను గ్రామ పెద్దలకు బాధితురాలు కేశవర్ధిని తెలియజేయగా వారు రాజీ ప్రయత్నాలు చేశారు. పెద్దల వద్ద సరైన న్యాయం జరగకపోవడంతో 24 రోజులు తరువాత కేశవర్ధిని పోలీసులకు ఫి ర్యాదు చేశారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మండవల్లి: మూలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సజ్జా సురేష్ (బాబి) హెచ్ఎం ఎం.మార్గరెట్ ఆధ్వర్యంలో ఎన్డీఏ నాయకులు చాలసాని కోటేశ్వరరావు (కోటయ్య) ఆర్థిక సాయంతో శుక్రవారం రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.నాని, జి.గణేష్, వి.శివయ్య, పి.చంద్రశేఖరరావు, సీహెచ్‌వీ రంగారావు, డి.రంగారావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



ఘంటసాల: డ్వాక్రా మహిళలు ఆరోగ్యంతో పాటు ఆదాయం సంపాదించుకోవడానికి ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి ఏరియా కో ఆర్డినేటర్ ఎమ్.మధు అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఘంటసాల మండలం ఏపీఎం బి.అమరేశ్వరరావు అధ్యక్షతన ఘంటసాల వెలుగు కార్యాలయంలో జరుగుతున్న విజయశ్రీ మండల మహిళా సమైఖ్యలో పని చేస్తున్న గ్రామైక్య సంఘాల ప్రెసిడెంట్లకు ఆహారం–పోషణ–ఆరోగ్యం–పారిశుద్ధ్యం అనే అంశాలపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మధు మాట్లాడుతూ శిక్షణ అంశాలను గ్రూపు సభ్యులకు తెలియజేసి ఆరోగ్యం ఉంటూ స్వయం ఉపాధి ద్వారా ఎలా ఆదాయం పొందాలో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ డి.శ్రీనివాసరావు, ఎమ్.ఝాన్సీ, సీసీ నాగేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో తూడు తొలగించాలని రైతుల ఆందోళన



వన్నేరు డ్రెయిన్‌లో తూడు తొలగించాలని ఆందోళన చేస్తున్న రైతులు

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రులోని వన్నేరు డ్రెయిన్‌లో నుంచి తూడు, గుర్రపుడెక్క తొలగించాలని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు బోయిన శివయ్య మాట్లాడుతూ వన్నేరు డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క నివారణ మందు పిచికారీ చేయకపోవటంతో ఇబ్బందిగా మారిందన్నారు. డ్రెయిన్‌లో మోటార్లు పెట్టి పొలాలకు నీరు పెట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. తూడు దట్టంగా ఉండటంతో సాగునీరు అందటం లేదన్నారు. ఇప్పుడు తూడు నివారణ చర్యలు చేపట్టకపోతే చిన్నపాటి వర్షానికే పల్లపు పొలాలు నీట మునిగిపోతాయని తెలిపారు. ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు చెప్పినా సమస్యను పరిష్కరించటం లేదన్నారు. ఈ విషయంపై ఏఈ ఉదయ్‌ను వివరణ కోరగా నిధులు మంజూరు కాగానే పనులను వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు.

పంటకాలువలు బాగుచేయండి

గుడివాడ టౌన్: మోటూరు చానల్ పంటకాలువ పరిస్థితి అధ్వానంగా ఉందని దానిని వెంటనే బాగుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. గుడివాడ పట్టణంతో పాటు పలు మండలాల్లోని గ్రామాలకు సాగు, తాగునీరు అందించే మోటూరు చానల్ గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో నిండిపోయిందని పేర్కొన్నారు. ఇక వీటికి అనుబంధ కాలువల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వీటిని ఇప్పుడు బాగుచేయకపోతే వచ్చే ఏడాది వరకు పరిస్థితి అధ్వానంగానే మారుతుందన్నారు. ఇక డ్రాపుల పరిస్థితి దయనీయంగా మారిందని గేట్లు పగిలిపోయి నీటి కట్టడికి ఇబ్బందిగా మారాయన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ సమస్యలపై స్పందించి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.



మోపర్రు వద్ద వన్నేరు డ్రెయిన్‌లో దట్టంగా ఉన్న తూడు, డెక్క



గుడివాడ మండలంలో కాలువ పరిస్థితిని చూపిస్తున్న ఆర్‌సీపీ రెడ్డి

రోడ్లు, డ్రెయిన్ల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: పట్టణంలోని సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆయన కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ ఉండకుండా సిల్టు తొలగించే పనులు వేగవంతం చేయాలన్నారు. సిల్టు తొలగించే విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు. సిల్టును తరలించే వాహనాలు పటిష్టంగా ఉండాలన్నారు. తరలించే సమయంలో సిల్టు రోడ్లపై పడితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. డ్రెయిన్లలో చెత్త, ఇతర వ్యర్థాలు ప్రజలు వేయకుండా వారిలో అవగాహన పెంచాలన్నారు. 36 వార్డుల లోని రోడ్ల మరమ్మతులకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో 26 వర్కులకు టెండర్లు ఖరారయ్యాయని కొన్ని పనులు పూర్తికాగా మరి కొన్ని ప్రారంభదశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇమ్యూనిటీ కార్యదర్శులు, అసిస్టెంట్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, ఎంఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధంకండి

ముదినేపల్లి రూరల్: మండలంలో వచ్చే నెల ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు సిద్ధం కావాలని ఎంపీడీఓ ఎన్ఎం గంగాధరరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీపై సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. పెరిగిన పెన్షన్ల మొత్తంతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నెలకు రూ.వెయ్యి వంతున మొత్తం మూడు వేలు బకాయిలు పెన్షన్ రూ.4వేలు కలిపి లబ్ధిదారులకు రూ.7వేలు వంతున పంపిణీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 9,073 మంది వివిధ రకాల పింఛనుదారులున్నారని వీరికి రూ.6.11కోట్లకు పైగా పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ తీసుకోవాలి

మండవల్లి: ప్రభుత్వం అందజేయనున్న పింఛన్లు జూలై ఒకటో తేదీన తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీఓ ఆర్.బేబిశ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండల పరిధిలో 6,965 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం రూ.4,65,89,500 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్లు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి గతంలో ఉన్న రూ. 3 వేలు, వెయ్యి పెంచి రూ. 4 వేలు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు నెలకు రూ. వెయ్యి చొప్పున రూ. 3 వేలు, పింఛన్ రూ.4 వేలు, ఒక్కొక్క పింఛన్‌దారునికి రూ.7 వేలు అందజేస్తారని తెలిపారు. ఒకటో తేదీన పింఛన్ తీసుకోకుంటే తర్వాత ఇచ్చే అవకాశం ఉండబోదని పేర్కొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: ప్రభుత్వం అందించే పింఛన్లు అన్ని గ్రామాల్లో జూలై ఒకటో తేదీన సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులతో పింఛన్లు పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జూలై ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకే పింఛన్లు ప్రతి ఒక్కరికీ కచ్చితంగా అందించాలన్నారు. ప్రతి ఉద్యోగి 50 నుంచి 60 మందికి ఇంటి వద్దకు వెళ్లి అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన



బంటుమిల్లిలో మాట్లాడుతున్న వైద్యురాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)వైద్యులు, సిబ్బంది ముందస్తుగా డయేరియా నివారణ చర్యలు చేపట్టాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం బంటుమిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో డయేరియా నివారణ, అవగాహన సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్న ఈ సమావేశంలో వైద్యురాలు సౌందర్య మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమం జూలై ఒకటవ తేదీ నుంచి 31 వరకు మండలంలో నిర్వహించాల్సి ఉందన్నారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి డయేరియాకు కారణమయ్యే విషయాలపై ప్రజలకు అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. ఎంపీడీవో జీఎస్.రామకృష్ణంరాజు, సీడీపీఓ ఎం.సముద్రవేణి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, మురుగునీటి వల్ల దోమలు, అంటు వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనికి అవసరమైన జింకుటాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మందులు పీహెచ్‌సీలతోపాటు సబ్‌సెంటర్లలోను, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల వద్ద ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీటీ శివ, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, భగవాన్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. పెదతుమ్మిడి పీహెచ్‌సీ పరిధిలో వైద్యురాలు సువర్చల పర్యవేక్షణలో వైద్య సిబ్బంది పలు గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం పిచికారి చేసి ఇండ్ల వద్ద మురుగునీరు నిలవ చేయకుండా జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం. దాసు, భారతి, కొండలరావు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి

వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ పద్మావతి

అవనిగడ్డ: ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం సంబంధిత అధికారులు, ఎరువులు, విత్తనాల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ పద్మావతి మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాగునీటి ఎద్దడి నేపథ్యంలో వెదపద్ధతి సాగుకు ప్రాధాన్యత ఇచ్చేలా రైతులను చైతన్య పరచాలన్నారు. సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులను సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులకు వివరించాలన్నారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించేలా చూడాలన్నారు. ఏడీఏ జయప్రద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యాన శాఖాధికారి జ్యోతి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాల ఏవోలు, వీఏలు, సచివాలయ అగ్రికల్చర్ సిబ్బంది, ఎరువులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



తోట్లవల్లూరు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తోట్లవల్లూరు గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి జంపాన శివలీల పేర్కొన్నారు. స్థానిక మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించటంతోపాటు ఆట, పాటలతోకూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లు నిండిన వారికి గ్రాడ్యుయేషన డే నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయకుమారి, కోకిలారాణి, భాగ్యం పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు, చినపారుపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే వర్ల కుమార రాజా శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరపనేని సత్యనారాయణ, చలసాని రమేష్ చౌదరి, చిలకా ఆంజనేయులు, మసిముక్కు రాంబాబు, నారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కైకలూరు: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ మార్గంతో పరిష్కరించుకోవాలని కైకలూరు సీనియర్ కోర్టు సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి శుక్రవారం పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని తెలిపారు. రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని తెలిపారు. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వాట్సాప్‌లో సమస్యలు తెలపండి

కైకలూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్‌కు తెలియజేసే అవకాశం అధికారులు కల్పించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా కె.వెట్రిసెల్వి ఇటీవల నియమితులయ్యారు. ఆమె ప్రజలకు ఓ సందేశాన్ని శుక్రవారం పంపించారు. మీ ప్రాంతాల్లో గమనించిన సమస్యలను 91910 41188 వాట్సాప్ నంబరుకు పంపించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

138 మందికి హోమియో వైద్య పరీక్షలు



హోమియో వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు లక్ష్మి

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 138 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో గుడివాడ ప్రభుత్వ గురురాజు హోమియో వైద్యశాల వైద్యులు ఆర్.లక్ష్మి, జూనియర్ డాక్టర్లు ప్రజ్ఞ, శిరీషా, మధుకిరణ్ రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి రిపోర్టులు ఇచ్చారు. రిపోర్టుల ఆధారంగా డాక్టరు లక్ష్మి పరీక్షించి మందులు సిఫార్సు చేశారు. ఎల్‌టీ గోపి షుగర్ వ్యాధిగ్రస్తులకు రక్త పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో కేంద్రం నిర్వాహకులు జల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయం

ముత్తేవి గౌరకృష్ణ గురుదేవులు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గౌర కృష్ణ గురుదేవులు, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి(మొవ్వ): స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని ముముక్షు జన మహాపీఠాధిపతులు, శ్రీ కృష్ణా ఆశ్రమ నిర్వాహకులు ముత్తేవి గౌరకృష్ణ పేర్కొన్నారు. శంకర నేత్రాలయ కంటి వైద్యశాల(మద్రాసు), నటరాజ నాట్యాంజలిల సంయుక్త ఆధ్వర్యంలో మొవ్వ మండలం కూచిపూడిలోని ఎస్‌ఏసీఎల్ కన్వెన్షన్ హాల్లో వారంరోజులుపాటు సాగే ఉచిత కంటి పొర చికిత్సా శిబిరాన్ని, గౌరకృష్ణ స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రామమూర్తా శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని అతిథుల సమక్షంలో గద్దమణుగు కుటుంబ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ కూచిపూడిలో పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యయులు కోసూరు ఆదినారాయణ రావు, గద్దమణుగు శివ శ్రీ, నీలిమ, శ్రీనివాస్, నేత్రవైద్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అరుల్, కొండవీటి అమరబాలేశ్వరరావు, నన్నపనేని వీరేంద్రం, లింగమనేని రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల సమస్య పరిష్కారం



గతంలో చెరువులను తలపిస్తున్న ఖాళీస్థలాలు



మెరక చేసిన ఖాళీ స్థలం

సాక్షి ఎఫెక్ట్

గుడివాడ టౌన్: పట్టణంలో ఖాళీ స్థలాల వలన ప్రజలు పడుతున్న కష్టాలను పట్టించుకోవాలని సాక్షి దినపత్రిక ఈ నెల 24వ తేదీ ఖాళీస్థలాలపై దృష్టి పెట్టండి అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. పట్టణంలోని ఖాళీ స్థలాలు గుంటలుగా మారి ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులుగా మారాయి. వాటిలో వ్యర్థాలు కుళ్లి దోమల ఖార్ఖానాలుగా మారాయి. ఈ సమస్యలు పట్టించుకోవాలని ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి పల్లపు స్థలాలను యజమానులతో మెరక చేయించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. దీంతో స్థానికులు సాక్షి కథనంపై హర్షం ప్రకటించారు.

రహదారులను బాగు చేయరూ..



బురదమయంగా మారిన అలీనఖీపాలెం రోడ్డు



అధ్వానంగా అలీనఖీపాలెం-నమ్మితాలగుంట రోడ్డు

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెం నుంచి కూడేరు శివారు నమ్మితాలగుంట వెళ్ల రోడ్డు, గ్రామంలోని పాతపీర్ల పంజా నుంచి మసీదు పొలం వరకు గల రహదారులు అధ్వానంగా మారాయి. రెండు రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే ఈ రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపై ప్రయాణం సాగక నమ్మితాలగుంట, అలీనఖీపాలెం వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేక అవస్థలు పడుతున్నారు. జూలై ఏడో తేదీ నుంచి అలీనఖీపాలెంలో మొహర్రం పర్వదినాలు ప్రారంభమవుతాయి. షియా ముస్లింలకు ఎంతో ముఖ్యమైన పర్వదినాలు. పీర్ల పంజాలలో ప్రత్యేక ప్రార్థనలు, గ్రామంలో పీర్ల ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయి. రెండు రహదారులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి నడిచేందుకు, వాహనాలు తిరిగేందుకు ఏర్పాట్లు చేయాలని అలీనఖీపాలెం, నమ్మితాలగుంట వాసులు కోరుతున్నారు.

పీఏసీఎస్‌లో నూరుశాతం రుణవసూళ్లు



ధ్రువీకరణ పత్రాన్ని మేనేజర్‌కు అందజేస్తున్న సీఈఓ, సిబ్బంది

నాగాయలంక: కేడీసీసీ బ్యాంకు నాగాయలంక బ్రాంచి పరిధిలోని పెదకమ్మవారిపాలెం పీఏసీఎస్‌లో 2023–24 సంవత్సరానికి నూరుశాతం రుణాలు వసూలు సాధించినట్లు సంఘం సీఈవో పి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సొసైటీలో 1,034 మంది రైతుల నుంచి స్వల్పకాలిక రుణాలు రూ.555.86 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.273.56 లక్షలు, మొత్తంగా రూ.829.42 లక్షల రుణాలను నూరుశాతం వసూలు శుక్రవారం నాటికి పూర్తి చేశారు. గత 14 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏటా నూరు శాతం వసూళ్లు కొనసాగుతుందని సీఈఓ పేర్కొన్నారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలను సిబ్బందితో కలసి ఆయన కేడీసీసీ చీఫ్ మేనేజర్ చింతలపూడి మధుబాబుకు అందజేశారు. రుణవసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని ఈ సందర్భంగా కేడీసీసీ నాగాయలంక బ్రాంచిలో జరిగిన ఒక కార్యక్రమంలో మేనేజర్ అభినందించారు. రుణ వసూళ్లలో నోడల్ అధికారి జీఎస్ ప్రకాశరావు, సూపర్‌వైజర్ రెహమున్నీసా, పాశం ఈశ్వరరావు, గోలి ఆదినారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

నాగాయితిప్ప(మోపిదేవి): విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని గ్రామ సర్పంచి గరికిపాటి వెంకటేశ్వరావు (బుల్లి) అన్నారు. మండల పరిధిలోని నాగాయితిప్ప ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్, బూట్లు, సాక్స్ అందజేశారు. అంతకుముందు 6,7,8 తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్, ఒకటో తరగతి నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు టెక్స్ట్‌బుక్స్ అందజేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీ మాధవరావు తెలిపారు. పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లింగం జగదీష్‌కుమార్, పాలకేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్ బాబు (నాని), వెల్ఫేర్ అసిస్టెంట్ పీతా మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.